క్లుప్తంగా

బిజినవేముల విద్యార్థి ప్రతిభ


నిఖిల్ కుమార్

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలం బిజినవేముల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి. నిఖిల్ కుమార్ అనే విద్యార్థి నేషనల్ మీమ్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభగల విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఈ ఉపకార వేతనాన్ని అందిస్తోందన్నారు. ఈ పథకానికి ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేలు స్కాలర్‌షిప్‌గా అందిస్తారని తెలిపారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లిలోని గ్రంథాలయాధికారి కౌసల్య ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును నిర్వహించారు. ఇందులో చిన్నారులకు పుస్తకపఠనం, చెస్, ఆటల పోటలు నిర్వహించారు. ఈ నెల 10 వతేదీ వరకు గ్రంథాలయ సమ్మర్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని గ్రంథాలయాధికారి తెలిపారు.

రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: రేషన్‌కార్డుల్లేని వారు నూతన రేషన్‌కార్డు కోసం గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాదికి రెండు పర్యాయాలు మాత్రమే రేషన్‌కార్డులు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రేషన్‌కార్డుల మంజూరు విషయమై ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. రేషన్‌కార్డుల్లేనివారు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని రేషన్‌కార్డు పొందవచ్చునన్నారు. అలాగే రేషన్‌కార్డుల్లో పేర్లులేని కుటుంబ సభ్యులను చేర్పించుకోవచ్చని తెలిపారు.

ర్యాంపును తొలగించొద్దు


ర్యాంపు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: ఎస్ఆర్ఎంసీ కాలువ ర్యాంపును తొలగించవద్దని జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి వ్యామ్ కంపెనీ వారిని ఆదివారం కోరారు. మండలంలోని తుమ్మలూరు గ్రామం సమీపంలో ఎస్ఆర్ఎంసీలో ప్రస్తుతం నిర్వహిస్తున్న లైనింగ్ పనుల్లో భాగంగా పాత ర్యాంపు తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈ విషయం గ్రామస్తులు జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లడంతో సర్పంచు వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగేశ్వరరెడ్డిలు ఎస్ఆర్ఎంసీ వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం వ్యామ్ కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ ఉశేస్‌తో మాట్లాడారు. ఈ ర్యాంపును తొలగించడం వల్ల ప్రజలు జీవనోపాధి కోల్పోతారని, ప్రధానంగా మత్స్యకారులు, రైతులు, రైతు కూలీలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. పశువులు నీరు తాగేందుకు, మత్స్యకారులు కాలువలోకి దిగేందుకు, ఎక్కేందుకు ఈ ర్యాంపు ఒక్కటే మార్గమన్నారు. ఈ విషయం డిపార్ట్‌మెంట్ అధికారులతో మాట్లాడామని, నూతనంగా ర్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు కూడా సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. వారి వెంట వైఎస్ఆర్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రైతులు ఉన్నారు.

మహానంది డీఆర్ఓ సుబ్బయ్య బదిలీ

మహానంది: అటవీశాఖ మహానంది డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సుబ్బయ్యను బదిలీ చేస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆదివారం తెలిసింది. ఆయనను బనగానపల్లెకు బదిలీ చేస్తూ అక్కడ డీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న హైమావతిని మహానంది డీఆర్‌ఓగా విధులు కేటాయించినట్లు తెలిసింది. ఈ మేరకు త్వరలోనే ఆమె మహానంది డీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

వెదురు వేలాలు వాయిదా

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ డిపోలో ప్రతి నెల 4వ తేదీన నిర్వహించాల్సిన వెదుర్ల వేలాలు ఆదివారం కావడంతో వాయిదాపడ్డాయి. సాధారణంగా ప్రతి నెలలో 4, 17వ తేదీల్లో వెదుర్లు, కలపను డీఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓల ఆధ్వర్యంలో బహిరంగ వేలాలు నిర్వహిస్తారు. ఆదివారం సెలవు కావడంతో ఈ నెల 6వ తేదీన వేలాలు నిర్వహించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

అన్నదానం

మహానంది: తమ్మడపల్లె గ్రామానికి చెందిన కొమ్మా అమర్‌నాథరెడ్డి, గాయత్రి దంపతుల కుమార్తె శివహన్వికారెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని ఆదివారం గోపవరం సమీపంలోని సెయింట్ ఆన్స్ మానసిక వికలాంగుల పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అల్లినగరం సర్పంచ్ లక్ష్మీదేవి, డాక్టర్ వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బాలవెంకటరెడ్డి, కొమ్మా శివప్రసాద్ రెడ్డి, ధర్మకర్త పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పండుగొచ్చింది

- ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు
- పూజలు చేసి ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించిన రైతన్నలు
- అన్నదాతకు అండగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం
- సమయానికి పెట్టుబడి సాయం
- రాయితీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు


ఏరువాక పౌర్ణమి సందర్భంగా నందికొట్కూరు సమీపంలో నాగలితో సేద్యం ప్రారంభించిన రైతన్న

నందికొట్కూరు: ఏరువాక పౌర్ణమి రైతులకు పెద్ద పండగ. నియోజకవర్గంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పొలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి రైతులు ఖరీఫ్ సాగు పనులను ప్రారంభించారు. పొలాల్లో నవధాన్యాలతో విత్తనం వేశారు. వ్యవసాయ అధికారులు, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివచ్చారు. పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం రైతు భరోసా నగదు, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేసి అన్నదాతలకు అండగా నిలిచింది. దీనికి తోడు వ్యవసాయాధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

38 వేల హెక్టార్లలో పంటల సాగు

నందికొట్కూరు నియోజకవర్గంలో 44 వేల హెక్టార్ల భూమి ఉండగా ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 38 వేల హెక్టార్లు ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులకు ఇచ్చిన మాటకంటే ముందుగానే వరుసగా ఐదో ఏడాది మొదటి విడతగా వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ, 7,500 బ్యాంకు ఖాతాల్లో ఈ నెల 2వ తేదీన బటన్ నొక్కి జమ చేశారు. రైతు భరోసా సాయం కింద రూ. 5, 500 ప్రభుత్వం జమ చేసింది. పీఎం కిసాన్ కింద రూ, 2 వేలు నిధులు విడుదలైన వెంటనే రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. నందికొట్కూరు నియోజకవర్గంలో 29,543 మంది రైతులకు రూ. 16.24కోట్లు పెట్టుబడి సాయాన్ని జమ చేశారు.

72 రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు

నియోజకవర్గంలో 72 రైతు భరోసా కేంద్రాలు ఉండగా వాటి ద్వారా ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందజేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం పగలు, రాత్రి కలిపి రైతులకు కరెంట్ 9 గంటలు ఇచ్చారు. రైతులకు రాత్రి పూట ఇస్తే ప్రాణ నష్టం కలుగుతుందనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పగలే ఉచితంగా 9 గంటలు విద్యుత్ అందజేస్తున్నారు. అలాగే రైతులు గ్రామం వదిలి వెళ్లకుండా రైతు భరోసా కేంద్రాల నుంచి అన్ని రకాల సేవలు అందించడం జరుగుతోంది.

సమయానికి పెట్టుబడి సాయం



ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.5,500 రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయం అందించారు. అప్పులు చేయకుండా ముందుగానే పంటలు వేసేందుకు విత్తనాలకు, ఎరువులకు సీఎం వైఎస్ జగనన్న సాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. జగనన్న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారు. జగనన్ననే మళ్లీ సీఎం కావాలి.

– నాగభూషణంరెడ్డి, 10 బొల్లవరం

అప్పు చేయకుండా వైఎస్సార్ రైతు భరోసా



వ్యవసాయం కోసం అప్పు చేయకుండా వైఎస్సార్ రైతు భరోసా కింద సీఎం వైఎస్ జగనన్న రూ, 7, 500 బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఖరీఫ్ సీజన్ వస్తే ముందుగానే అప్పులు తెచ్చుకుని విత్తనాలు వేసేందులకు సిద్ధంగా ఉండేవాళ్లం. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత అడకుండానే ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు భరోసా ఇస్తున్నారు. మళ్లీ మళ్లీ జగనన్ననే సీఎం కావాలి.

– చంద్రబాబు,గువ్వలకుంట

ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ బదిలీ

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎంపీడీఓ మంజులవాణి డిప్యుటేషన్‌పై, ఈఓపీఆర్డీ మణిమంజరి పదోన్నతులపై వెళ్లారు. ఈ మేరకు కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ మంజులవాణి డిప్యూటేషన్‌పై నంద్యాల జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ అధికారిణిగా వెళ్లారు. ఈఓపీఆర్డీ మణిమంజరి పదోన్నతిపై మంత్రాలయం ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా జూపాడుబంగ్లా ఎంపీడీఓగా కొత్తవారిని ఎవరినీ నియమించలేదు. నందికొట్కూరు ఈఓపీఆర్డీ సుబ్రహ్మణ్యం శర్మకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు.

దశరథరామయ్యకు పదోన్నతి



మిడుతూరు: మిడుతూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న దశరథరామయ్య పదోన్నతిపై కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు తాలుకా నందవరం మండలం ఎంపీడీఓగా బదిలీపై వెళ్లినట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మిడుతూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా దశరథరామయ్య దాదాపు 4 సంవత్సరాలుగా విధులు నిర్వహించారు.

గుండ్లకమ్మ వాగు పరిశీలన

ఆత్మకూరు: పట్టణంలోని గుండ్లకమ్మ వాగును ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాల్వకు ఎలాంటి మరమ్మతులు చేయాలని, కాల్వలో పూడికను తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి తదితర విషయాలపై వాగును పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయచౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్


వేంపెంటలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాములపాడు: భారతరాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ఫలాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం వేంపెంట గ్రామంలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులందరూ గర్వించదగ్గ వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్‌కుమార్, డాక్టర్ నాగన్న, ప్రొఫెసర్ నాగరాజు, ఆర్డీఓ దాసు, సీఐ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రత్నరాధిక, ఎస్ఐ అశోక్, ఎంపీటీసీ సభ్యురాలు బోనాల నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆత్మకూరు: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎస్సీ, ఎస్టీ కమిషనర్ విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యమైందన్నారు. దళిత శ్మశాన వాటికల ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దళితులు నిర్భయంగా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో కార్యక్రమంలో దళిత నాయకులు శీలం శేషు, రవికుమార్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

జూపాడుబంగ్లా: కర్నూలు ఉమ్మడి జిల్లాలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన రజక విద్యార్థులు ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు రజక విద్యాసేవా సమితి జిల్లా అధ్యక్షుడు సీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని రజక విద్యార్థులు పదో తరగతిలో 450, ఇంటర్‌లో 850పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు, డిగ్రీలో 80శాతం మార్కులు సాధించిన వారు, ఎంసెట్‌లో ఇంజినీరింగ్, మెడిసిన్ విభాగాల్లో 10వేల లోపు ర్యాంకు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు వారు సాధించిన మార్కుల జాబితా జిరాక్సు కాపీలతో కర్నూలులోని 41-473-119, సాయిబాబా సంజీవనగర్, కర్నూలు చిరునామాకు పంపించవచ్చని పేర్కొన్నారు. లేదా సెల్ నంబర్లు: 9110396511, 9849751373కు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.

నెహ్రూనగర్‌లో తాగునీటి ఎద్దడి

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలోని బెస్తవారి కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పక్షం రోజులుగా కాలనీలోని మినీ ట్యాంకులకు తాగునీటి సరఫరా కావడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిలకు తాగునీరు సరఫరా కాకపోవటంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి తెల్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. విషయమై గ్రామ సర్పంచ్ రాజేశ్వరిని సంప్రదించినా సమస్యను పరిష్కరించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

రెండు కార్లు ఢీ.. తప్పిన ప్రమాదం


ప్రమాదంలో రెండు కార్లు ఢీకొన్న దృశ్యం

మహానంది: రెండు కార్లు ఢీ కొనడంతో పెద్ద ప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం బోయిలకుంట్ల మెట్ట వద్ద చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన రవికిరణ్, కుటుంబ సభ్యులు బోయిలకుంట్ల నుంచి కారులో మహానంది వైపు వస్తుండగా, నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న కరీంనగర్‌కు చెందిన ఓదేలు కారు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో కరీంనగర్‌కు చెందిన కారుడ్రైవర్ కుమార్ స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పోలీసు సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి వివరాలు సేకరించారు. ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆత్మకూరు: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ సమీపంలో భారత్ పెట్రోల్ బంద్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన శివ ఆటో మొబైల్ యజమాని శివ ఉదయం ఇంటి నుంచి మంచినీటి బిందెను బైక్‌పై తీసుకొని వస్తుండగా పెట్రోల్ బంక్ నుంచి ట్రాక్టర్ ఒక్క సారిగా రావడంతో శివ కింద పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయాలు అయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్య శాలలో చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నందికొట్కూరు: తెలంగాణ మద్యం బైక్ అక్రమంగా తరలిస్తుండగా సెబ్ సీఐ రమేష్‌రెడ్డి ఆదివారం పట్టుకున్నారు. తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తునట్లు సమాచారం అందడంతో సెబ్ సీఐ తమ సిబ్బందితో పట్టణ సమీపంలో ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ వద్ద చేరుకున్నారు. బైక్‌ను పట్టుకునేందుకు ప్రయత్నం చేయగా నాగరాజు స్పీడ్‌గా వెళ్లడంతో కింద పడ్డాడు. ఎక్సైజ్ సీఐ, సిబ్బంది అక్కడికి చేరుకుని బైక్, క్వాటర్ బాటిళ్లు -184, 90 ఎంఎల్ సీసాలు-88 స్వాధీనం చేసుకున్నారు. కాళ్లకు, తలకు, ముక్కు వద్ద గాయాలు కావడంతో నిందితుడు నాగరాజును ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్‌కు ఎక్సైజ్ సీఐ ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాల ఘర్షణ

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రంగస్వామి ఇంటివద్ద కాల్వలో వర్షపునీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశాడు. దిగువకు మురుగునీరు వెళ్లేలా కట్టను తొలగించాలని ఎస్సీకాలనీకి చెందిన రాముడు, రంగన్న, నాగన్నలు రంగస్వామిని కోరారు. దీంతో అతను కట్టను తొలగించనని మొండికేయటంతో మాటా మాటా పెరగటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఈ ఘర్షణలో ఇరువర్గాలవారికి గాయాలయ్యాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై ఇరువర్గాల వారిని విచారిస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

కేసు నమోదు

మహానంది: బండిఆత్మకూరు మండల కడమలకాల్వ గ్రామంలో శనివారం ఆలయ భూముల వేలాల సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాబు ఆదివారం తెలిపారు. ఎస్ఐ బాబు మాట్లాడుతూ ఆలయాలకు చెందిన భూముల వేలాల్లో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన వీరాంజనేయులు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన వెంకటరమణ, బాబు, శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

బాటసారి జర భద్రం !


రహదారిలో కల్వర్టు పై ఏర్పడిన గొయ్యి

పాములపాడు: మండలంలోని లింగాల, కొత్తపల్లి మండలం నాగంపల్లి గ్రామాల మధ్యన బీటీ రహదారిపై ఉన్న కల్వర్టు వద్ద ఏర్పడిన గోతి ప్రమాదకరంగా మారింది. బాటసారులు ఏ మాత్రం అ జాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడాల్సిందే. ఈ రహదారిలో నిత్యం వాహనచోదకులు, రైతులు, రైతు కూలీలు ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఎద్దుల బండ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరూ ప్రమాదం బారిన పడకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బలగం సినిమా ఇంటి పేరును మార్చేసింది


మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన నటుడు ప్రసాద్

మహానంది: ఇటీవల విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందిన బలగం సినిమా తన ఇంటి పేరు మార్చి బలగం ప్రసాద్‌గా గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని సినీ, టీవీ నటుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్ ఆలియాస్ బలగం ప్రసాద్ పేర్కొన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మహానంది వచ్చారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం కలిసిన విలేకరులతో మాట్లాడుతూ తాను నంద్యాల వాసినే అన్నారు. గత నలభై ఏళ్లుగా సాంఘిక నాటకాల ప్రదర్శన చేస్తుండటం ద్వారా సినిమాల్లో అవకాశాలు తగ్గిపోయినట్లు చెప్పారు. అయితే బలగం చిత్రంలో పోషించిన పాత్ర ఎంతో గుర్తింపు ఇచ్చిందన్నారు. అలాగే హీరో బాలకృష్ణ నటించిన చిత్రంలో అర్చకుడి పాత్ర చేశానని, నందమూరి జయకృష్ణ కుమారుడు చైతన్యకృష్ణ హీరోగా చేస్తున్న బ్రీత్ సినిమాలో హీరో మేనమామగా నటిస్తున్నానన్నారు. ఇప్పటి వరకు 43 సినిమాల్లో నటించినట్లు తెలిపారు. ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ నాటకాల పట్ల మక్కువతో నటించడం జరిగిందని, బళ్లారి రాఘవ, నంది అవార్డులు వచ్చాయన్నారు. ఆయన వెంట సీనియర్ పాత్రికేయులు పసుపులేటి జనార్దన్ తదితరులు ఉన్నారు.

అన్నదాతలకు అండగా నిలవాలి


కాడెద్దులతో పొలాన్ని దున్నుతున్న రైతు సంఘం నాయకులు

జూపాడుబంగ్లా: దేశ, రాష్ట్ర ప్రజల కడుపునింపే అన్నదాతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో కాడెద్దులతో పొలం దున్ని రైతు సంఘం అధ్వర్యంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు దన్నుగా నిలబడి పంటల సాగు సమయానికి రైతు భరోసా-పీఎం కిసాన్ నగదు మంజూరు చేయటంతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు మంజూరు చేసిందన్నారు. దీనికితోడు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం సత్వరమే రైతులను ఆదుకోవడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు రామకృష్ణ, మండల నాయకులు హరినాయుడు, ఏన్న, వడ్డెశివమణి, ప్రసాద్, జంగాల సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

అమ్మవారికి పల్లకీ సేవ


పల్లకీలో స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు,ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.

త్వరలో మహానంది గర్భాలయ గోపుర కలశ ప్రతిష్ఠ


ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న కలశం

మహానంది: మహానందిలో త్వరలో గర్భాలయ గోపుర శిఖర కలశ ప్రతిష్ఠ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గాజులపల్లె ఆర్ఎస్ గ్రామంలో వెలిసిన శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర స్వామి, నవగ్రహాల ఆలయాల వ్యవస్థాపకులు మస్తాన్‌రావు సహకారంతో గోపుర కలశాలకు బంగారు తాపడం చేయించామన్నారు. కంచి కామకోటి పీఠాధిపతులతో చర్చించి త్వరలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కలశప్రతిష్ఠ ఉత్సవంతో పాటు కుంభాభిషేకం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. టీటీడీ నుంచి మంజూరైన రూ.4.60కోట్లతో వసతిగృహాల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని, వీటితో పాటు రూ.80లక్షలతో కోనేరుల ఆధునికీకరణ పనులు సైతం ప్రారంభించినట్లు వివరించారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: ఓంకారం క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ ఓంకార సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకం, అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అన్నప్రసాదాలు స్వీకరించి మెట్లమార్గంలో వెళ్లి ఆలయాలను తిలకించారు.

శైవక్షేత్రాల్లో భక్తుల పూజలు


కొలనుభారతిలో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఏరువాకపౌర్ణమి పురస్కరించుకొని పుణ్యక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలలో ఆదివారం భక్తులు విశేషపూజలు నిర్వహించారు. సంగమేశ్వరం ఆలయంలో ఆలయ పురోహితులు తెల్కపల్లి రఘురామశర్మ భక్తులచే వేపదారు శివలింగానికి కృష్ణా నదిజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర విశేష పూజలను వేదమంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. అదేవిధంగా కొలనుభారతి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించుకున్నారు. అక్కడే వెలసిన సప్తశివాలయాలను దర్శించుకొని భక్తి పరవశులయ్యారు. అమ్మవారి సన్నిధిలో 22 మంది చిన్నారులకు ఆలయ పురోహితులు బీజాక్షరాలు దిద్దించి అక్షరభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ కిశోర్ దంపతులు సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా గ్రామోత్సవం


విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు, క్రిష్టారావుపేట గ్రామాల్లో ప్రతిష్ఠోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీసుంకులా పరమేశ్వరి నూతన విగ్రహానికి ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. పురోహితులు పవన్‌కుమార్ బృందం మంత్రోచ్చరణలతో అమ్మవారి విగ్రహాన్ని జలాధివాసము నుంచి బయటకు తీసి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలతో గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయ, కర్పూరాలు సమర్పించుకున్నారు.

నేడు ప్రతిష్ఠ

నేడు శ్రీసుంకులాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉదయం 9 గంటలకు జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.